



- ఖమ్మం రవాణా శాఖ కార్యాలయంలో నిలిచిన ఆర్‌సీ కార్డుల ప్రింటింగ్
- ప్రధాన కార్యాలయం నుంచి స్టేషనరీ లేదంటున్న శాఖ అధికారులు
- 47 రోజులుగా ప్రదక్షిణలు చేస్తున్న వాహనదారులు

# కార్డులకు కటకట!

రఘునాథపాలెం, జూలై 1 : రవాణా శాఖ అధికారుల తప్పిదం.. వాహనదారులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. 'వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం.. కార్డు ఇవ్వండి సారూ..' అంటూ వాహనదారులు నెత్తీ నోరూ బాదుకున్నా ఒక్క అధికారి నుంచి కూడా సరైన సమాధానం రావడం లేదు. ఈ దృశ్యాలు ఖమ్మంలోని రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ఇటీవల నిత్యకృత్యంగా కన్పిస్తున్నాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం కార్యాలయంలో సేవలను పొందిన వాహనదారుడికి 24 గంటల్లోనే సంబంధిత పత్రాలను అప్పగించాలి. కార్యాలయ బయట ఏర్పాటు చేసిన సిటిజన్ చార్టర్‌లో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. కానీ.. క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. ఖమ్మం రవాణా శాఖ ద్వారా వాహన రిజిస్ట్రేషన్లు, రెన్యూవళ్లు వంటి వివిధ రకాల సేవలు పొందిన వాహనదారులకు 47 రోజులుగా ఆర్‌సీ కార్డులకు దిక్కులేకుండా పోయింది. దీంతో తాము తమ వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ పోలీసులు ఎక్కడ పట్టుకొని ఫైన్ రాస్తారో అనే భయంలో రోడ్డెక్కలేని పరిస్థితి వాహనదారుల్లో నెలకొంది. అయితే, కార్డుల ప్రింటింగ్, జారీ నిలిచిపోవడానికి తమ ప్రధాన కార్యాలయం నుంచి స్టేషనరీ రాకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు.


ఖమ్మంలోని రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయం

### స్టేషనరీ రుసుము తీసుకుంటున్నప్పటికీ..

రిజిస్ట్రేషన్ చేయించుకునే సమయంలోనే ప్రతి వాహనదారుడూ తాను పొందే సేవలకు అవసరమైన పత్రాల కోసం స్టేషనరీ రూపంలో రుసుము చెల్లిస్తుంటాడు. అయితే, 'ఇంత కచ్చితంగా రుసుము తీసుకుంటున్న రవాణా శాఖ అధికారులు.. స్టేషనరీ అయిపోయిందని సాకులు చెప్పడం విడ్డూరంగా ఉంది.' అంటున్నారు అక్కడికొచ్చిన వాహనదారులు. వెహికిల్ న్యూ రిజిస్ట్రేషన్, నాన్ ట్రాన్స్‌పోర్ట్, ట్రాన్స్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ వంటి సేవలకు రవాణా శాఖ నుంచి కార్డులను జారీ చేస్తారు. అయితే 47 రోజులుగా కార్యాలయంలో జరుగుతున్న ఈ సేవలకు కార్డుల జారీయే లేకుండా పోయింది. సేవలు పొందిన వాహనదారులు నిత్యం కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ.. వారి చేతికి కార్డు చేరని పరిస్థితి. వాహనం ఉన్నప్పటికీ కార్డులు చేతిలో లేని కారణంగా వాహనదారుడు తన వాహనాన్ని రోడ్డుపై నడపలేని దుస్థితి. అయితే, పొరపాటున వాహనాన్ని రోడ్డు మీదకు తెచ్చినా పోలీసులు తనిఖీ చేసి జరిమానా విధిస్తే తమ పరిస్థితి ఏంటంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### మే 15 నుంచి పెండింగ్

హైదరాబాద్ నుంచి స్టేషనరీ రాకపోవడంతో ఆర్‌సీ కార్డులు మే 15వ తేదీ నుంచి ప్రింట్ తీయడం లేదు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాహనదారులు కార్డుల కోసం కార్యాలయానికి నిత్యం వచ్చిపోతున్నారు. సుమారు 4 వేల వరకు పెండింగ్ ఉన్నాయి. కార్డులు రాగానే ప్రింట్ తీసి పంపిణీ చేస్తాం.

**– జాహెద్ అలీ, కార్యాలయ ఏవో**

### నెల రోజులుగా ఎదురుచూపులు



నేను వాహనం రిజిస్ట్రేషన్ చేయించుకొని నెల రోజులు దాటింది. కార్డు పోస్టులో ఇంటికి వస్తుందేమోనని ఎదురుచూశా. పలుమార్లు పోస్టుమాన్‌ను కలిసి అడిగినా రాలేదని చెప్పాడు. ఏం చేయాలో తెలియక జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి అధికారులను అడిగితే కార్డులు లేవంటున్నారు.

**– సీహెచ్.సురేశ్‌రెడ్డి, వాహనదారుడు, ఖమ్మం**

### బండి తీయాలంటే భయమేస్తోంది



ఆర్‌సీ కార్డు కోసం 47 రోజులుగా వేచి చూస్తున్నా. కార్డు రాకపోవడంతో వాహనం బయటకు తీయాలంటేనే భయమేస్తోంది. కార్యాలయానికి వస్తే.. స్టేషనరీ లేకపోవడంతో ప్రింట్ తీయట్లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌సీ కార్డులు ఇప్పించే విధంగా చర్యలు చేపట్టాలి.

**– కే.పవన్‌కుమార్, వాహనదారుడు, ఖమ్మం**

## బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ
# టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసనలు


రామవరం: మైన్లు, డిపార్ట్‌మెంట్లలో నిరసనలు తెలిపి అధికారులకు మెమోరాండం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు


ఇల్లెందు రూరల్ : వినతిపత్రం ఇస్తున్న టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు మహ్మద్ జాఫర్ హుస్సేన్

రామవరం, జూలై 1 : బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొత్తగూడెం ఏరియాలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో మైన్స్, ఓసీలు, డిపార్ట్‌మెంట్‌లోని కార్మికులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి మాత్రమే కేటాయించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దీనిపై స్పందించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం హెచ్‌వోడీలకు మెమోరాండం అందించారు. చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కూసన వీరభద్రం, ఏరియా ఉపాధ్యక్షుడు గడప రాజయ్య, సెంట్రల్ కమిటీ మెంబర్లు కాగితపు విజయ్‌కుమార్, బూర్గుల రవికుమార్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పూర్ణచందర్, చంద్రశేఖర్, వెంకట్రావ్, ఎన్‌వీ రావు, గణేష్, అశోక్, సీతారామ, నరేందర్, రాజ్‌కుమార్, సత్యనారాయణ, రమేశ్, సూరిబాబు, నాగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

### బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి

**టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు మహ్మద్ జాఫర్ హుస్సేన్**

ఇల్లెందు రూరల్, జూలై 1 : కేంద్ర ప్రభుత్వం వేలంపాట నిర్వహించకుండా తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు మహ్మద్ జాఫర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన సింగరేణి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ప్రభుత్వరంగ సంస్థగా లక్షలాది మంది ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుస్తోందన్నారు. ఎందరికో ఉద్యోగ అవకాశాలు కల్పించి ఉపాధి చూపుతూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. అయితే కొత్త బొగ్గు బ్లాకులను కేటాయించకపోవడం, ఉన్న బ్లాకులలో బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో సంస్థలో పనిచేస్తున్న 41 వేల మంది కార్మికుల భవిష్యత్ ఆందోళనకరంగా మారిందన్నారు. శ్రావణపల్లి ఓసీతోపాటు కల్యాణఖని బొగ్గు బ్లాకును సింగరేణి సంస్థలకే కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

# చిన్నారులకు అభయహస్తం అందించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

మామిళ్లగూడెం, జూలై 1 : ఆదరణ కరువై, తల్లిదండ్రులకు దూరమైన చిన్నారులకు అభయహస్తం అందించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఆపరేషన్ ముస్కాన్–10 కార్యక్రమంలో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను తన కార్యాలయంలో సీపీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1 నుంచి నెల రోజులపాటు జరిగే కార్యక్రమంలో బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, ట్రాఫికింగ్ ద్వారా వివిధ వ్యవస్థల్లో బందీలైన వారిని గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చాలన్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారులను సంరక్షణ కేంద్రాలకు తరలించి.. వారి బాధ్యతలను సంబంధిత విభాగాలకు అప్పగించనున్నట్లు తెలిపారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు 184 మంది చిన్నారులను రెస్క్యూ చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. బాలల చేత వెట్టిచాకిరీ చేయిస్తున్న యజమానులపై 67 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. బాలలతో బలవంతంగా భిక్షాటన, వెట్టిచాకిరీ చేయించిన వారిపై కేసులు యథావిధిగా నమోదు చేయాలన్నారు. ఈ ఆపరేషన్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ విభాగం, కార్మిక శాఖ, కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ, లీగల్ సర్వీసెస్ అథారిటీ విభాగాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు పాలుపంచుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేశ్‌కుమార్, ఏఆర్ ఏసీపీ నర్సయ్య, సుశీల్‌సింగ్, ఆర్ ఐ కామరాజు, ఎస్సైలు శ్రీకాంత్, సీసీఆర్‌బీ ఏఎస్సై జ్యోతి పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే ప్రత్యేకంగా తీర్చిదిద్దుతా..

- మధిరలో ఐటీ హబ్.. బోనకల్లులో ఇందిరా డెయిరీ
- విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

మధిర, జూలై 1 : మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రత్యేకంగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, ఐటీ హబ్ నిర్మాణం కోసం ఇప్పటికే భూమిని గుర్తించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం మధిర క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంలో ఐటీ హబ్ ఏర్పాటుకు కావాల్సిన సదుపాయాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. దీనికితోడు మధిర మండలం సిరిపురం సమీపంలోని యడ్లపల్లి గుట్ట వద్ద ఎంఎస్‌ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు నిధులు కేటాయిస్తామని, త్వరలోనే దీనికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఇందులో పరిశ్రమలు పెట్టుకునే యువతకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ట్రెడిషనల్ వ్యాపారాన్ని పారిశ్రామీకరణ చేసి.. ఉత్పత్తి, వినియోగాన్ని పెంచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రాష్ట్రంలోనే తొలిసారిగా ఇందిరమ్మ పేరున ఇందిరా డెయిరీని బోనకల్లులో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ డెయి రీ కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శంకుస్థాపన చేశామని, మళ్లీ దీని నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందిరమ్మ డెయిరీ వల్ల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని, వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఇక్కడి నుంచే పాల ఉత్పత్తి, ప్యాకింగ్, మార్కెటింగ్ ఇతరత్రా కార్యక్రమాలు చేపట్టేందుకు వీలు కలుతుందని ఆయన పేర్కొన్నారు.

# వేధింపులా.. సమన్వయలోపమా?

- 'పేట' ఎస్సై ఆత్మహత్యాయత్నంపై సర్వత్రా చర్చ
- కారణాలపై ఆరా తీస్తున్న ఉన్నతాధికారులు
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలింపు


హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఎస్సై శ్రీను

అశ్వారావుపేట, జూలై 1 : అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై జిల్లా ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. వ్యక్తిగత వేధింపులా.. స్టేషన్ సిబ్బంది సమన్వయ లోపమా అనే చర్చ మండలవ్యాప్తంగా ప్రజల్లో జోరుగా సాగుతున్నది. పోలీస్‌స్టేషన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలు, జిల్లా ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది సహాయ నిరాకరణ వంటి అనేక అనుమానాలు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. పూర్తి వివరాల్లోకెళ్తే.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన ఎస్సై శ్రీరాముల శ్రీను 2014లో ఎస్సైగా ఎంపికయ్యారు. జిల్లాలోని పలు మండలాల్లో పనిచేసిన ఆయన మణుగూరు నుంచి ఫిబ్రవరి నెలలో అశ్వారావుపేటకు బదిలీపై వచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. అయితే కొంతకాలంగా స్టేషన్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సిబ్బంది, అధికారుల మధ్య సమన్వయం చేసేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. అసలు ఏమి జరిగిందో తెలియదు కానీ ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో పోలీస్‌స్టేషన్‌కు మఫ్టీలో వచ్చిన ఎస్సై శ్రీను కొత్త చట్టాల అమలు దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలిస్తుండగా ఆయన కారును డ్రైవర్ అక్కడకు తీసుకొచ్చాడు. కొద్దిసేపటికే డ్రైవర్‌ను అక్కడ దింపి ఇప్పుడే వస్తానంటూ స్వయంగా కారు డ్రైవ్ చేసుకుని బయటకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం వరకు రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆరా తీశారు. ఎస్సై వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. దీంతో స్టేషన్ సిబ్బందితోపాటు కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. రాత్రి సమయం అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎస్సై మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానిక పోలీసులకు సుమారు రాత్రి 11గంటల సమయంలో సమాచారం అందింది. మహబూబాబాద్ ఆర్తి గార్డెన్ సమీపంలో పురుగులమందు తాగి డయల్ 108కి స్వయంగా ఎస్సై ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈక్రమంలో సెల్‌ఫోన్ లొకేషన్‌ను ట్రాప్ చేసే పనిలో ఉన్న పోలీసులు లొకేషన్‌ను గుర్తించి అక్కడికి చేరుకున్నారు. అపస్మారకస్థితిలో పడి ఉన్న ఎస్సై శ్రీనును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎస్సై ఆరోగ్యం కుదుటపడితేనే అసలు కారణం తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే సీఐ వేధింపులు, కొందరు కానిస్టేబుళ్లతో విభేదాలు, సిబ్బంది సహాయ నిరాకరణ తదితర కారణాల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు మహబూబాబాద్ మీడియాకు ఎస్సై శ్రీను సమాచారం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

### ఎమ్మెల్యే జారే పరామర్శ

హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్సై శ్రీరాముల శ్రీనును అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో ఎస్సై ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు జూపల్లి రమేశ్ ఉన్నారు.

# అధ్వానంగా అప్రోచ్

- బురద పొలాన్ని తలపిస్తున్న అన్నారంతండా రోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు, పాదచారులు



మోకాళ్ల లోతు బురదలో ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు

చండ్రుగొండ, జూలై 1 : విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అప్రోచ్ రోడ్డు బురదమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పుడే ఇలా ఉంటే.. మున్ముందు భారీ వర్షాలతో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మండలంలోని అన్నారంతండా వాగుపై రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో పక్కన వేసిన అప్రోచ్ రోడ్డు వర్షాలతో బురద పొలాన్ని తలపిస్తోంది. బ్రిడ్జి నిర్మాణం చేపట్టి నెలలు గడుస్తున్నా.. మూడు రోజుల క్రితం బురద మట్టితో అప్రోచ్ రోడ్డు నిర్మించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండల కేంద్రానికి, తండాకు ఆదాపు రాకపోకలు బంద్ అయ్యాయి. మొరంతో అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి ఆ రోడ్డుపై కంకర, గ్రావెల్ పోయించాలని గ్రామస్తులు కోరారు.

# అర్జీలకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించండి

**ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్**


వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

మామిళ్లగూడెం, జూలై 1 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్.. వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు ఫార్వర్డ్ చేశారు. అర్బన్ మండలం వెలుగుమట్ల నుంచి బోడ సక్రియా, పెనుబల్లి మండలం చౌడవరం నుంచి గుర్రం వెంకటేశ్వరరావు, సింగరేణి మండలం నుంచి అలగడి పద్మ, ఖానాపురం హవేలి నుంచి సామినేని వెంకటేశ్వర్లు, ఖమ్మం నుంచి ముదిగుండ్ల నాగ అనిల్‌కుమార్, వైరాలోని హనుమాన్ బజార్ నుంచి డి.నరసింహారావు, సింగరేణి మండలం నుంచి కొమ్ము ఉపేంద్రయ్య, ఖమ్మం నుంచి డి.సంధ్య తమ తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.రాజేశ్వరి, జడ్పీ సీఈవో ఎస్.వినోద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


## అప్రోచ్ రోడ్డు నిర్మించండి..
# తెగిపోయిన రోడ్డు వద్ద గ్రామస్తుల ఆందోళన



ములకలపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, ఆటో యూనియన్ నాయకులు

ములకలపల్లి, జూలై 1 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ములకలపల్లి–తాళ్లపాయి గ్రామాల మధ్య ఆదివారం కురిసిన వర్షాలు, వరదలకు తెగిపోయిన అప్రోచ్ రోడ్డును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం ఆ ప్రాంతంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం వల్ల నాణ్యతా ప్రమాణాలతో నిర్మించకపోవడంతో చిన్నపాటి వరదలకే అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయిందని తెలిపారు. తాళ్లపాయి పంచాయతీలోని ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని, దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఐటీడీఏ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుత వర్షాకాలంలో ఇంకా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందోనని, వెంటనే సంబంధిత శాఖ అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు, ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

# కొత్తగూడెం ఓఎస్డీగా పరితోష్

**భద్రాచలం ఏఎస్పీగా అంకిత్**



కొత్తగూడెం ఓఎస్డీగా పంకజ్ పరితోష్


భద్రాచలం ఏఎస్పీగా అంకిత్‌కుమార్

కొత్తగూడెం క్రైం/భద్రాచలం, జూలై 1 : రాష్ట్రంలో ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న పరితోష్ పంకజ్‌ను కొత్తగూడెం ఓఎస్డీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జనగామ జిల్లా ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న అంకిత్‌కుమార్ సంఖ్వార్‌ను భద్రాచలం ఏఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రస్తుతం కొత్తగూడెం అదనపు ఎస్పీ(ఆపరేషన్స్)గా విధులు నిర్వర్తిస్తున్న టి.సాయిమనోహర్ బదిలీకి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న పరితోష్ పంకజ్.. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఆనుకొని ఉన్న భద్రాచలం సబ్ డివిజన్ పరిధిలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై పూర్తిస్థాయిలో అవగాహనతోపాటు అతి తక్కువ కాలంలో ఆయా గ్రామాల్లో మంచిపేరు గడించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఆయనకు కొత్తగూడెం ఓఎస్డీ(ఆపరేషన్స్)గా బాధ్యతలు అప్పగించింది. అలాగే జనగామ ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న అంకిత్‌కుమార్ సంఖ్వార్‌కు భద్రాచలం ఏఎస్పీగా బాధ్యతలు అప్పగించింది. కాగా.. వీరిద్దరూ ఐపీఎస్ 2020 బ్యాచ్‌కు చెందిన వారు కావడం విశేషం.

# కొత్తగూడెం క్లబ్‌లో మెగా జాబ్‌మేళా

- 2,450మంది హాజరు, 1,531 మంది ఎంపిక
- పాల్గొన్న కలెక్టర్ జితేష్, ఎమ్మెల్యే కూనంనేని


జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువకులు, ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్

కొత్తగూడెం టౌన్, జూలై 1 : తెలంగాణ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్, కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, బీఈ, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఎస్, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు చదివి నిరుద్యోగులైన వారు 2,450 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో సుమారు 60 ప్రముఖ కంపెనీల్లో 603మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. 928 మందిని తర్వాత ఇంటర్వ్యూకి ఎంపిక చేశారు. మొత్తం 1,531 మందిని జాబ్‌మేళాలో ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఉపాధి కల్పన అధికారి విజేత, యువజన క్రీడల అధికారి సంజీవరావు, సిబ్బంది ఉదయ్‌కుమార్, తిరుమలరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.